క్లుప్తంగా

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్ /వనస్థలిపురం రైతుబజార్‌లలో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 19, వంకాయ 28, బెండ 55, పచ్చిమిర్చి 50, కాకర 45, బీర 45, క్యాలీఫ్లవర్ 25, క్యాబేజీ 10, క్యారెట్ 15, దొండ 47, ఆలు 19, ఉల్లి 14, గోకర 45, దోస 45, సొర 17, పొట్ల 15, అరటి 10, చిక్కుడు 45, అర్వి 68, మునగ 55, చిలగడదుంప 38, బీట్‌రూట్ 17, కీర 23, ఫ్రెంచ్ బీన్స్ 65, కాప్సికమ్ 50 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు శుక్రవారం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

పేద యువతుల వివాహానికి చేయూత



పుస్తె, మెట్టెలు అందజేస్తున్న శ్రీనివాస్‌గుప్తా, స్వప్న దంపతులు

నాగోలు: నిరు పేదలకు ఉప్పల ఫౌండేషన్ అండగా ఉంటుందని ఉప్పల ఫౌండేషన్ చైర్మన్, తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. గురువారం ఉప్పల ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుపేద కుటుంబాలకు చెందిన ముగ్గురు అమ్మాయిల వివాహాలకు మంగళ సూత్రాలు, మెట్టెలు, చీరలు, గాజులను విరాళంగా అందజేశారు. జనగామ జిల్లా దేవరుప్పుల మండలం సీతారామ పురం గ్రామానికి చెందిన దివ్యకు, సంగారెడ్డి జిల్లా పఠాన్‌చెరుకు చెందిన స్వాతి, సరిత వివాహం సందర్భంగా గురువారం నాగోలులోని ఉప్పల శ్రీనివాస్ క్యాంప్ కార్యాలయంలో వారి కుటుంబ సభ్యులు ఆయనను కలిశారు. వారి కుటుంబ, ఆర్థిక పరిస్థితి తెలుసుకొని ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, కో చైర్ పర్సన్ ఉప్పల స్వప్న చేతుల మీదుగా మంగళ సూత్రాలు, మెట్టెలు, చీరలు, గాజులను అందజేశారు.

చిట్టీల పేరుతో మోసగించిన వారిపై కేసు

చంచల్‌గూడ: చిట్టీలు కట్టించుకుని చేతులెత్తేసిన మాదన్నపేట రెడ్డి జన సంఘం నిర్వాహకులపై మాదన్నపేటకు చెందిన సెంట్రింగ్ కూలీ సతీష్ మాదన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో దర్యాప్తు చేపట్టిన పోలీసులు ప్రధాన నిందితుడిగా బొక్క భూపాల్‌రెడ్డితో పాటు రెడ్డి సంఘం నిర్వాహకులపై చీటింగ్ కేసు నమోదు చేశారు.

ఆకట్టుకున్న కర్ణాటక సంగీత గాత్ర కచేరీ



నాగోలు: శాస్త్రీయ సంగీత కళాకారణులు దర్భ మృధువళి, హరిణిల కర్ణాటక సంగీత గాత్ర కచేరీ శాస్త్రీయ సంగీత ప్రియులను అలరించింది. కొత్తపేట డివిజన్ స్నేహపురి కాలనీలో శ్రీ గోదా సమేత పద్మావతీ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో రసమైత్రి సంస్థ ప్రథమ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా గురువారం రాత్రి కర్ణాటక సంగీత గాత్ర కచేరీ ఏర్పాటు చేశారు. దర్భ సిస్టర్స్‌గా సంగీత ప్రియులకు పరిచయమున్న మృదురవళి, హరిణిలు పాడిన కీర్తనలు సంగీత ప్రియుల మన్ననలు పొందాయి. వయొలిన్ సహకారం కేఎల్ఎస్ మూర్తి మృదంగ సహకారం, ఘటం సహకారం అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రసమైత్రి వ్యవస్థాపకులు వారణాశి వంశీ, యాదాద్రి ఆలయ చీఫ్ డిజైనర్ ఆనంద్ సాయి, హేమసుందర్‌రావు, మల్లాది శర్మ ప్రత్యూష, హరి, జొన్నలగడ్డ యశ్విని, కూచిపూడి కళాకారిణి రమణి సిద్ధి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దర్భ సిస్టర్స్‌ను నిర్వాహకులు ఘనంగా సన్మానం చేశారు.

దర్గాకు సామగ్రి

ఎంపీ రంజిత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన కమిటీ



ఎంపీ అందజేసిన ఫ్యాన్లతో దర్గా కమిటీ సభ్యులు

పహాడీషరీఫ్: బాబా షర్ఫొద్దీన్ దర్గా 757వ ఉర్సు ఉత్సవాలను పురస్కరించుకొని భక్తులకు అసౌకర్యాలు కలగకుండా చేవెళ్ల ఎంపీ రంజిత్ రెడ్డి సొంతంగా మెట్లపైకి మ్యాట్, పది ఫ్యాన్లను అందించారు. పహాడీషరీఫ్ గ్రామ బీఆర్ఎస్ నాయకుడు పందెం కొండల్ యాదవ్ దర్గా కమిటీ ప్రతినిధులతో కలిసి ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన సామగ్రిని బుధవారం రాత్రి వారికి అందజేశారు. దర్గా అభివృద్ధికి కృషి చేయడంతో సొంతంగా కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయడం పట్ల కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

వారాంతాపు సంతలతో ట్రా'ఫికర్'!

- రోడ్ల మీదే దుకాణాలు, తోపుడుబండ్లు
- వాహనదారులకు తప్పని కష్టాలు
- పట్టించుకోని అధికారులు



నాగోలు బండ్లగూడలో వారాంతపు సంతతో ఆగిన వాహనాలు

నాగోలు: పలు ప్రాంతాల్లో వారాంతపు సంతలను రోడ్లపైనే ఏర్పాటు చేస్తున్నారు. ఆయా రహదారుల గుండా రాకపోకలు సాగించే వాహనదారులు, పాదచారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. రోడ్లపైనే దుకాణాలు, తోపుడు బండ్లను పెట్టుకొని కూరగాయలను విక్రయిస్తుంటారు. కూరగాయల కొనుగోలుకు స్థానికులు రోడ్ల మీదకు రావడం, తోపుడు బండ్లను రోడ్ల మీదే ఏర్పాటు చేయడంతో అక్కడి నుంచి సాఫీగా వెళ్లే పరిస్థితి లేక వాహనదారులు ట్రాఫిక్‌లో చిక్కుకుపోతున్నారు. వాహనాలను క్రమబద్ధీకరించేందుకు ట్రాఫిక్ పోలీసులు, సంత నిర్వాహకులు పట్టించుకోక పోవడంతో రోడ్లపై పెద్ద ఎత్తున ట్రాఫిక్ జామ్ అవుతోంది. దీంతో వాహదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గం పరిధిలోని నాగోలు డివిజన్ పరిధిలో శనివారం నాగోలు సుజాత హోటల్ సమీపంలో, బండ్లగూడ ప్రధాన రహదారిపై ఆదివారం కూరగాయల మార్కెట్‌లను ఏర్పాటు చేస్తారు. పక్కనే ఉన్న జైపురికాలనీ రోడ్డు, సాయినగర్, చాణిక్యపురి కాలనీలో రోడ్ల మీదనే బండ్లు, దుకాణాలను ఏర్పాటు చేసి కూరగాయలు అమ్ముతుంటారు. నాగోలు చౌరస్తా నుంచి బండ్లగూడ మీద ఔటర్ రింగ్ రోడ్డుకు రేడియల్ రోడ్డు ఉండటంతో నిత్యం వందలాది వాహనాలు ఔటర్ రింగ్ రోడ్డుకు, విజయవాడ జాతీయ రహదారికి పెద్ద ఎత్తున వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు.

- శనివారం నాగోలు గ్రామం, మోర్ మార్కెట్ సమీపంలో కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేయడంతో సాయంత్రం వేళల్లో కూరగాయలు కొనేందుకు కాలనీవాసులు అక్కడికి వస్తుంటారు. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది.
- బండ్లగూడ ప్రధాన రహదారిపై ఆదివారం మార్కెట్ ఏర్పాటు చేస్తారు. అక్కడా ఇదే పరిస్థితి నెలకొంటుంది.
- వాహనాల రాకపోకలను నియంత్రించే విషయాన్ని ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోక పోవడంతో వాహనదారులు అక్కడ నుంచి వెళ్లేందుకు నానా ఇబ్బందులు పడుతుంటారు.
- ఇకనైనా జీహెచ్ఎంసీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు ఈ విషయంపై స్పందించి ప్రధాన రహదారులపై వారాంతపు సంతలు ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.



నాగోలులో కూరగాయల మార్కెట్ రోడ్డుపై నిలిచిపోయిన వాహనాలు

ఓపెన్ స్థలాల్లో ఏర్పాటు చేసుకోవాలి...

- వారాంతపు సంతలను వివిధ కాలనీల్లో ఉన్న ఓపెన్ స్థలాల్లో ఏర్పాటు చేసుకుంటే ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు ఉండదని స్థానికులు పేర్కొంటున్నారు. రహదారులపై ఏర్పాటు చేయడంతో అన్ని విధాలా అసౌకర్యంగా ఉంటుందన్నారు.
- ఆయా సమస్యలను అధిగమించేందుకు అధికారులు, కూరగాయల వ్యాపారులు సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

'పంపు'లను మరమ్మతు చేయించాలని వినతి



మేయర్‌కు వినతిపత్రమిస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: వేసవి ప్రారంభంకానున్న దృష్ట్యా జీహెచ్ఎంసీలోని పవర్ బోర్లు, హ్యాండ్ పంపులను వెంటనే మరమ్మతులు చేయాలని జీహెచ్ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి కోరారు. ఈ మేరకు వినతిపత్రాలను నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతాశోభన్‌రెడ్డికి గురువారం సమర్పించారు. అనంతరం మన్సూరాబాద్‌లోని తన కార్యాలయంలో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... బస్తీలు, నోటిఫైడ్ ఏరియాల్లోని ప్రజలు నీటి సమస్యను ఎదుర్కొంటున్నారన్నారు. అవసరమున్న ప్రాంతాల్లో నూతన పవర్ బోర్లు వేయాల్సి ఉందని కోరినట్లు తెలిపారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని వీరన్నగుట్ట, పుకట్‌బస్తీ, బాల్‌రెడ్డినగర్, బృందావన్‌నగర్, ఎల్ఐసీ వీకర్ సెక్షన్ కాలనీలలోని హ్యాండ్‌పంపులు, పవర్ బోర్లను మరమ్మతులు చేయాలన్నారు. పని చేయని వాటి స్థానంలో నూతన బోర్లు వేసేందుకు నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేసినట్లు కార్పొరేటర్ వివరించారు.

ఉత్సవాల కమిటీ చైర్మన్‌గా బాబురాజు

చాదర్‌ఘాట్: బాబు జగ్జీవన్‌రాం, బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాల కమిటీ చైర్మన్‌గా బాబురాజు నాలుగోసారి నియమితులయ్యారు. ఈ సందర్భంగా గురువారం ఓల్డ్‌మలక్‌పేట పోచమ్మ ఆలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనను చౌకి రవికుమార్ శాలువాతో ఘనంగా సన్మానించారు. నేతలు వేముల విజయ్‌కుమార్, చీపురు రాజారావు గౌడ్, శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.



బాబురాజును సన్మానిస్తున్న రవికుమార్

సంస్కృతిని సంరక్షించుకోవాలి



బండి సంజయ్‌తో కృష్ణాదిశేషు

ఎల్‌బీనగర్: కేంద్ర ఫిల్మ్ సెన్సార్ బోర్డు సభ్యులు కృష్ణాదిశేషు గురువారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ... ప్రస్తుతం సమాజంపై సినిమా ప్రభావం చాలా ఉందన్నారు. భాష, సాంస్కృతి, సంప్రదాయాలు దిగజారిపోతున్నాయని వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత సెన్సార్ బోర్డు సభ్యులపై ఉందన్నారు. కార్యక్రమంలో నేతలు ఉపేందర్, వసంత కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని తీరు దేశానికి నష్టం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్ సుజాతానాయక్ తదితరులు

ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం: ప్రధాని నరేంద్రమోదీ వ్యవహారతీరు దేశానికి నష్టం కల్గించేవిగా ఉన్నాయని... ఆయన దేశానికి ప్రధానిగాకాకుండా గుజరాత్‌కు మాత్రమే ప్రధానిగా తన పాలనను కొనసాగిస్తున్నారని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆరోపించారు. అహ్మదాబాద్‌లో ఆదానీ కట్టిన స్టేడియంలో గురువారం భారత్, ఆస్ట్రేలియా దేశాల మధ్య జరుగుతున్న 4వ క్రికెట్ టెస్ట్ మ్యాచ్‌కు ఆస్ట్రేలియా ప్రధాని ఆంటోనియో అల్బనీస్ హాజరైన నేపథ్యంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలసి గురువారం వనస్థలిపురంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రధాని మనసులో మాట అంటూ వివిధ అంశాలపై రూపొందించిన పోస్టర్లను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... సింగరేణి గనుల్లో కావాల్సినంత బొగ్గు లభిస్తున్నా ఆదానీకి లబ్ధి చేకూర్చేందుకు 10 శాతం బొగ్గు ఇతరుల నుంచి కొనేలా మోడీ చట్టం తీసుకువచ్చారని ఆరోపించారు. కష్టాలలో ఉన్న మిత్రుడు ఆదానీని ఒడ్డున పడేయడానికి మోడీ దేశాన్ని ఆయనకు దోచిపెడుతున్నారని అన్నారు. ప్రశ్నిస్తున్న వారిపై సీబీఐ, ఈడీ, ఐటీ వంటి కేంద్ర సంస్థలతో దాడులు చేయిస్తున్నారని అన్నారు. హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్, మాజీ కార్పొరేటర్లు సామ తిరుమల్‌రెడ్డి, జిట్టా రాజశేఖర్‌రెడ్డి తదితరులు మాట్లాడారు. మాజీ కార్పొరేటర్లు, భవానీ ప్రవీణ్ కుమార్, జి.వి.సాగర్‌రెడ్డి, ముద్రబోయిన శ్రీనివాసరావు, కొప్పుల విఠల్‌రెడ్డి, నాయకులు గజ్జల మధుసూదన్‌రెడ్డి, చెరుకు ప్రశాంత్‌గౌడ్, బిచినేపల్లి వెంకటేశ్వర్‌రావు, గుడాల మల్లేష్, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

కవితకు ఈడీ నోటీసులు తెలంగాణపై దాడే

దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవరెడ్డి

చాదర్‌ఘాట్: ప్రధాని నరేంద్రమోదీ సర్కార్ వైఫల్యాలను ఎండగడుతున్నందుకే బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని అస్థిరపరచాలని బీజేపీ కుట్ర చేస్తున్నదని రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మలక్‌పేటలో ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ... ఎమ్మెల్సీ కవితకు ఈడీ నోటీసులు ఇవ్వటం తెలంగాణపై చేస్తున్న కుట్రగానే పరిగణిస్తామని స్పష్టం చేశారు. కార్పొరేట్ అదానీ అవకతవకలను, మోసాలను హిడెన్‌బర్గ్ నివేదిక బయటపెడితే దేశం మీద దాడిగా ప్రచారం చేసుకున్న నీచ చరిత్ర బీజేపీ నాయకులదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ఆత్మగౌరవం మీద సాగుతున్న అణిచివేత కుట్రలను కచ్చితంగా తిప్పికొడతామని ఆయన స్పష్టం చేశారు.

ఉచిత వైద్య శిబిరాల నిర్వహణ అభినందనీయం

అబిడ్స్: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ఆశీష్‌కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించే ఆశీష్‌కుమార్ ఆయుష్ కేంద్ర ఉచిత మెగా వైద్య శిబిరం పోస్టర్లను మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ గురువారం ఆవిష్కరించారు. ప్రభుత్వానికి తోడుగా ఇలాంటి వైద్య శిబిరాలు నిర్వహించడం ప్రజలకు ఎంతో మేలు చేస్తాయన్నారు. ఆశీష్‌కుమార్‌యాదవ్ గోషామహల్‌లో పేద బడుగు వర్గాల ప్రజల కోసం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తుండడం ఎంతో అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆశీష్ కుమార్‌యాదవ్, ప్రేమ్‌కుమార్ దూత్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

చాదర్‌ఘాట్: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని తిరుమల బ్యాంక్ చైర్మన్ నంగనూరి చంద్రశేఖర్ పేర్కొన్నారు. తిరుమల కో ఆపరేటివ్ బ్యాంక్ సిల్వర్ జూబ్లీ సెలబ్రేషన్స్ సందర్భంగా మలక్‌పేటలోని బ్యాంక్ ఆవరణలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీపీ, షుగర్ తదితర వైద్య పరీక్షలు నిర్వహించారన్నారు. వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నామని ఆయన తెలిపారు. తిరుమల బ్యాంక్ ఆధ్వర్యంలో కేర్ ఆస్పత్రి సహకారంతో నిర్వహించిన శిబిరంలో డైరెక్టర్‌లు కిషోర్ సర్కార్, అబ్దుల్ ఉస్మాన్ పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు

దిల్‌సుఖ్‌నగర్: రామకృష్ణాపురంలో శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి వారి దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాయలంలో నిర్వహించిన పూజ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర టూరిజం డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా పాల్గొన్నారు. రాజు శ్రీవాత్సవ్, టెంపుల్ చైర్మన్ జగిని రమేష్ గుప్తా, ఆలయ కమిటీ సభ్యులు, పండితులు, భక్తులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కమిటీ ఎన్నిక

మీర్‌పేట: బాలాపూర్ మండల మధ్యాహ్న భోజన కమిటీ నూతన కార్యవర్గాన్ని గురువారం సీఐటీయూ మండల కన్వీనర్ జే.పెంటయ్య ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కృష్ణవేణి, ఉపాధ్యక్షులు గాయత్రి, ప్రధాన కార్యదర్శిగా ఫాతీమాబేగం, సహ కార్యదర్శి అంజమ్మ, కోశాధికారిగా వీరస్వామి, కమిటీ సభ్యులుగా మైసమ్మ, ఖతీజలత, విజయలక్ష్మి, సరిత, శ్రీలత, వనజ, సుమలత, సుధావేణి ఎన్నికయ్యారు. కార్యక్రమానికి మధ్యాహ్న భోజన కమిటీ జిల్లా కార్యదర్శి స్వప్న ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

రమణీయం సత్యదేవుని రథోత్సవం

రామంతాపూర్: సత్యదేవుని ఆలయ 50వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి 8 గంటల నుంచి నిర్వహించిన రథోత్సవంలో శ్రీరమాదేవి సమేత సత్యనారాయణ స్వామి ఉత్సవ మూర్తులను ఊరేగించారు. పలు వీధుల్లో రథోత్సవం జోరుగా సాగింది. కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ కోట్ల నర్సింహారెడ్డి, ఈవో సత్యచంద్రరెడ్డి, ప్రధాన అర్చకులు విజయసారథి, తిరుపతాచార్యులు, శేషాచార్యులు, సీతారామచార్యులు, అన్నమనేని జగదీష్, భాస్కర్, శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది మురళీధర్‌రావు, శంకర్, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో మహిళ ప్రసవం

ఉప్పల్: నిండు గర్భిణికి పురిటి నొప్పులు రావడంతో గురువారం ఉప్పల్ 108 అంబులెన్స్‌కు సమాచారం అందింది. హుటాహుటిన టెక్నిషియన్ నాగరాజు, పైలెట్ వెంకటరమణ బోడుప్పల్‌కు చెందిన పెద్దిరాజు లక్ష్మీ(35) ఇంటికి చేరుకున్నారు. వెంటనే ఆమెను అంబులెన్స్‌లోకి ఎక్కించి ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో నొప్పులు అధికమయ్యాయి. దీంతో టెక్నీషియన్ నాగరాజు వాహనాన్ని నిలిపి పురుడు పోశాడు. మగబిడ్డకు ఆమె జన్మనిచ్చింది. అనంతరం వారిని చికిత్స నిమిత్త గాంధీ ఆస్పత్రికి తరలించారు.

లహరికి ఉగాది జాతీయ పురస్కారం



అబిడ్స్: ఐఎస్‌.ఓ గుర్తింపు పొందిన జాతీయ తెలుగు సాహిత్య, సాంస్కృతిక భాషా సంస్థ కర్ణాటక తెలుగు రచయిత్రుల సమాఖ్య ఉగాది జాతీయ పురస్కారం 2023కు కవయిత్రి ఎస్.లహరి ఎంపికయ్యారు. కొన్ని సంవత్సరాలుగా ఎన్నో కవితలను రాయడంలో ఆమె ప్రతిభను గుర్తించి ఉగాది జాతీయ పురస్కారానికి ఎంపిక చేసినట్లు సమాఖ్య చైర్మన్ డాక్టర్ మాల్యాద్రి బొగ్గవరపు ప్రకటించారు. కవయిత్రి లహరి మార్చి 19న బెంగళూర్‌లో జరిగే జాతీయ పురస్కారాల కార్యక్రమంలో ఉగాది జాతీయ పురస్కారం అందుకోనున్నారు. ఈ సందర్భంగా లహరి మట్లాడుతూ.. తెలుగు సాహిత్యంలో తాను చేస్తున్న కృషికి, ప్రతిబింబించే కవితా సంపుటి అక్షర నేత్రాలకి ప్రత్యేక పురస్కారం లభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

ట్రాన్స్‌జెండర్లు గౌరవప్రదంగా జీవించేందుకు సహకారం

వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ కోలా సత్యనారాయణ



ట్రాన్స్‌జెండర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ

హస్తినాపురం: సమాజంలో ట్రాన్స్‌జెండర్లు గౌరవప్రదంగా జీవించాలని, కొంత మంది ట్రాన్స్‌జెండర్లు ప్రజలను ఇబ్బందుకు గురిచేస్తున్నారని అలాంటి వారిపై చట్టపరంగా తగు చర్యలు తీసుకుంటామని వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ కోలా సత్యనారాయణ అన్నారు. రాచకొండ కమిషనర్ ఆదేశాల మేరకు పోలీస్ స్టేషన్‌లో ట్రాన్స్‌జెండర్ల నాయకులు ఆర్తి, దీపాలి, శ్రావణి, వైష్ణవి, నిజాశ్రీ,రాధిక, హనీలకు ఆయన అవగాహన కల్పించారు. రాత్రి వేళల్లో ట్రాఫిక్ సిగ్నళ్ల వద్ద వాహనాలకు అడ్డుగా వెళ్లి డబ్బులు అడుగుతున్నారని, సాగర్ కాంప్లెక్స్ నుంచి ఇంజాపూర్ వెళ్లే రహదారిపై ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ప్రజల నుంచి ఫిర్యాదులు అందాయన్నారు. ఇకపై ప్రజలను ఇబ్బందులు పెట్టే పనులను మానుకోవాలని వారికి ఇన్‌స్పెక్టర్ సూచించారు. కొంతమంది చేసే చిల్లర పనుల వల్ల మిగిలిన అందరికీ చెడ్డపేరు వస్తుందన్నారు. ట్రాన్స్‌జెండర్స్ సమాజంలో గౌరవప్రదంగా జీవించేందుకు పోలీసుశాఖ అండగా ఉంటుందని, ఏసమస్య వచ్చినా, ఎవరైనా ఇబ్బందులకు గురిచేసినా తమ దృష్టికి తీసువస్తే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీఐ వెంకట్, అడ్మిన్ ఎస్ఐ స్వామిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలతో కిడ్నీ వ్యాధులకు చెక్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి రమేష్‌గౌడ్

లింగోజిగూడ: ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటూ ఆరోగ్య సూత్రాలను పాటిస్తే మూత్రపిండాల వ్యాధులకు దూరంగా ఉండవచ్చని, ప్రతి ఒక్కరూ ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించుకోవాలని అవేర్ గ్లోబల్ ఆస్పత్రి వైద్యులు పేర్కొన్నారు. ప్రపంచ మూత్ర పిండాల దినోత్సవం సందర్భంగా గురువారం ఆస్పత్రిలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అవేర్ వైద్యులు మాట్లాడుతూ... కరోనా మహమ్మారి విజృంభించిన సమయంలో చాలా మంది ఆస్పత్రులకు వెళ్లలేదని, అందులో ఎక్కువ మంది మూత్రపిండాల రోగులు ఉన్నారని గుర్తుచేశారు. నిత్యం కనీసం ఐదు కిలోమీటర్లైనా నడిస్తే ఆరోగ్యంగా ఉండొచ్చన్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి రమేష్‌గౌడ్ మాట్లాడుతూ... చెడు అలవాట్లే రోగాలకు ప్రధాన కారణమన్నారు. మంచి ఆహార అలవాట్లతో వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చన్నారు. ఆస్పత్రి సీఈఓ సత్యేందర్ సింగ్, వైద్యులు నవీన్, శశిధర్, రాజీవ్ పాల్గొన్నారు.

రాష్ట్రపతి, గవర్నర్‌లను స్ఫూర్తిగా తీసుకోవాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి

సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి

చైతన్యపురి: ఉన్నత విలువలతో ఉన్నత స్థానాలకు మహిళలు చేరుకోవాలని, భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, రాష్ట్ర గవర్నర్ తమిళిసైలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి అన్నారు. చైతన్యపురి వీవీనగర్‌లోని పాణినీయ బీఈడీ కళాశాలలో గురువారం జరిగిన మహిళా దినోత్సవానికి న్యాయమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మహిళలు దేశంలోని అన్ని రంగాల్లో సేవలను అందించటం దేశానికే గర్వకారణం అని శ్రీదేవి పేర్కొన్నారు. చదువుతో పాటు సెల్ఫ్ డిఫెన్స్ తప్పని సరిగా నేర్చుకోవాలని సూచించారు. బాధితులకు ఉచితంగా న్యాయ సహాయం, ఉచిత లాయర్‌ను ఏర్పాటు చేసేందుకు జిల్లా నాయ సేవాధికార సంస్థ సిద్ధంగా ఉంటుందన్నారు. కళాశాల చైర్మన్ వసుధ, ప్రిన్సిపాల్ మాధవి, అడ్మిన్ కుమారి, ఆధ్యాపక బృందం, విద్యార్థినులు పాల్గొన్నారు.

స్త్రీ శక్తి అవార్డుల ప్రదానం

చైతన్యపురి: వివిధ రంగాలలో విశేష సేవలందించి గుర్తింపు పొందిన 18 మంది మహిళలకు శ్రీషిరిడీ సాయి అష్టాంగ ధ్యానమండలి ఆధ్వర్యంలో స్త్రీ శక్తి అవార్డులను ప్రదానం చేశారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని లోటస్ ల్యాప్ స్కూల్ ఆవరణలో బుధవారం రాత్రి అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. కూచిపూడి భరతనాట్యం, కొరియోగ్రఫీ, వైద్యం, అనాథ పిల్లలకు విద్య, యోగాలో శిక్షణ తదితర రంగాల్లో విశిష్ట సేవలను అందించిన మహిళలకు ధ్యానమండలి వ్యవస్థాపకులు భిక్షమయ్య గురూజీ చేతుల మీదుగా అవార్డులను ప్రదానం చేశారు. అనంతరం జీహెచ్ఎంసీ శానిటేష్ విభాగంలో పనిచేసే మహిళా కార్మికులకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గురూజీ మాట్లాడుతూ... సమాజంలో మహిళల పాత్ర గొప్పదని, ప్రతి వ్యక్తి ఉన్నత శిఖరాలను అందుకోవటంలో తల్లి పాత్ర విశేషమైనదన్నారు. పాఠశాల చైర్మన్ లయన్ గోపాల్‌రెడ్డి, యోగా గురువు ఇస్మాయిల్, మంజు ఉమెన్ మల్టిపుల్ డెవలప్‌మెంట్ ఫౌండర్ టీకుల మంజులారెడ్డి, హస్తినాపురం కార్పొరేటర్ సుజాత నాయక్ తదితరులు పాల్గొన్నారు.



డ్రైనేజీ సమస్యలను పరిష్కరించండి



మారుతీనగర్‌లో సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

నాగోలు: కాలనీల్లో సమస్యలు లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్ జలమండలి అధికారులకు సూచించారు. మారుతీనగర్ రోడ్డు నెంబర్-10లో డ్రైనేజీ, తాగునీటి సమస్యలు, రోడ్డు సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆయన గురువారం మారుతీనగర్ కాలనీలో పర్యటించారు. కాలనీలోని ఒక అపార్ట్‌మెంట్ వారు సమాచారం లేకుండా 6 ఇంచుల లైన్‌లో ఒక ఫీట్ పైప్‌లైన్ కలపడంతో నిరంతరం నీళ్లు జాం అయి పొంగుతున్నాయని కాలనీవాసులు తెలిపారు. వెంటనే సమస్య పరిష్కరించాలని కోరారు. స్పందించిన కార్పొరేటర్ జలమండలి జీఎం బలరామ్‌ని సంప్రదించి అనుమతి లేకుండా 6 ఇంచుల డ్రైనేజీ లైన్‌లో ఒక ఫీట్ పైప్‌లైన్ ఎలా కలిపారని ప్రశ్నించారు. వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ విషయంపై తగు చర్యలు తీసుకుంటామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. కాలనీ అధ్యక్షుడు మల్లేష్, నేతలు కామేశ్వరరావు, కృష్ణమూర్తి, మల్లయ్య, బీజేపీ నాయకులు సుందర్ నారాయణ, మంచి రాజేష్, యూ రామకృష్ణ, కిరణ్ కుమార్, కొత్త తిరుమల్, గట్టు మహేష్ తదితరులు పాల్గొన్నారు.